# రెక్కలు

ఆ ముగ్గురూ ఖాకీ దుస్తుల్లో ఉన్న ఆడపిల్లలని తెలుస్తూనే ఉంది, వాళ్ళ ఎత్తుల్నిబట్టీ. కదలికల్నిబట్టీ, పోలీస్‌స్టేషన్ ముందు ముసలి కానిస్టేబుల్‌తో ఆ ముగ్గురూ అటూ ఇటూ చూస్తూ నిల్చున్నారు. వాళ్ళకు దగ్గరలోనే మూడు బ్యాగులున్నాయి. మాకు లాగే వాళ్ళకుకూడా ఎలక్షన్ డ్యూటీ పడినట్లుంది. మా రూటు లారీ ఆగీ ఆగగానే, ఆ ముగ్గురాడపిల్లలూ బ్యాగులు పుచ్చుకొని, లారీ వెనకవైపు నిల్చున్నారు. ఇరవై, ఇరవై అయిదేండ్ల లోపు వయసుండవచ్చు. ఇంట్లో ఉన్న మా పెద్దమ్మాయికన్నా పెద్దవాళ్ళయి ఉండరు. ఆ ముగ్గురి వయసులకూ అటూ ఇటూ వయసులున్న నా కూతుళ్ళు చెయ్యలేని పని వీళ్ళు చేస్తున్నారు. ముచ్చటేసింది. కానీ ఈ రకం డ్యూటీలో గొడవలేవైనా ఎదురైతే, పాపం? భయమేసింది. ఆడపిల్లల తండ్రిగా శంకించడం, కీడెంచడం, భయపడ్డం అలవాటయ్యాయి.

లారీ వెనుక తలుపు కుడిపక్క మూలగా బాడీని ఆనుకొని వాళ్ళను చూస్తూ ఆలోచనల్లో పడ్డాను. ఆ ముగ్గురిలో ముందు నిలబడి ఉన్న అమ్మాయి తలఎత్తి నన్ను చూస్తూ తన స్నేహితురాళ్ళతో అంది:

"ఎట్లాగే...లారీ వెనకడోరు తియ్యమందాం."

తీసేసే మంచిదని నాకూ అనిపించింది. లారీలో వాళ్ళను చూశాను. పి. ఓ. లు, ఏ. పి. ఓ. లు చర్చల్లో మునిగి ఉన్నారు. చర్చల్లో లేని మా ప్రిసైడింగ్ ఆఫీసర్ సిగరెట్ ఆనందంలో ఉన్నారు. డ్రైవర్ ఇంజను ఆపలేదు, సీట్లోంచి దిగలేదు. క్లీనరూ దిగిరాలేదు. రూటు ఆఫీసర్ క్యాబిన్‌లోనే ఉన్నట్లుంది. కానిస్టేబులే మాట్లాడి వచ్చినట్లుంది. ఏం చేయడమా అనుకుంటూ దిక్కులు చూస్తున్నాను.

"ఇదుగో, ఇట్లాగే...చచ్చు మొగమా! చిన్నప్పుడు చింతచెట్లెక్కలేదా?" అంటూ అంతలోనే ఆ ముగ్గురి వెనుక ఉన్న అమ్మాయి ముందుకొచ్చింది.

ముసలి కానిస్టేబుల్ హెచ్చరించాడు, బొంగురు గొంతుతో:

"జాగ్రత్త! జాగ్రత్త! తల్లీ! నీకు ముందే తొందరపాటెక్కువ. కాలుజారి పడేవు. స్టేషన్లోనుంచి ఒక స్టూలన్నా తెచ్చుకొని ఎక్కండి."

అప్పటికే 'తొందరపాటెక్కు వమ్మాయి' లారీ బాడీలోకి చేరింది. లారీ వెనుక తలుపు మీదికి వంగి, చెయ్యి చాపుతూ అంది:

"జారిపడడానికి ఇదేం బాత్రూమా సార్? స్టూలూ వద్దు గిలూ వద్దు. ఊఁ - ముందా బ్యాగు లందుకోండే."

కింద ఉన్న ఇద్దరమ్మాయిలూ మూడు బ్యాగుల్ని అందించారు. లారీలోని అమ్మాయికి సాయపడి బ్యాగుల్ని నేను పక్కన పెట్టాను. మా పోలింగ్ స్టేషన్ ఎన్నికల సామగ్రి ఉన్న గోనెసంచీపక్క.

"ఆఁ - ఇప్పుడెక్కండి. ఇద్దరూ ఇద్దరే. ఏం హోంగార్డులో ఏమో? ట్రాఫిక్ కంట్రోలే వణికిపోతూ చేస్తారు. ఇప్పుడా పల్లెల్లో సెక్యూరిటీ! ఏం చేస్తాం? మన రోజులిట్లా. కానీ ఎక్కండి మరి. ఆఁ - ఏమే! ముందు నువ్వు నా చెయ్యి గట్టిగా పట్టుకో. కుడికాలి బూటు అక్కడ ఆ మెట్టు దగ్గర అదిమి ఎడమ చేత్తో ఆ కడ్డీ పట్టుకొని ఎక్కు," గటగబా మాట్లాడుతూ మరొకవైపు నవ్వుతూ ఆ యిద్దరినీ ఒకరి తర్వాత ఒకరిని తొందరపాటమ్మాయి లారీలోకి ఎక్కించింది.

గోనెసంచీ మీద ముందువైపు నింపాదిగా కూర్చొని ఉన్న మా పి. ఓ., నాగేశ్వరరావుకు ఈ దృశ్యం ఆనందం కలిగించినట్లుంది. నా పక్కనున్న గోనెసంచీ మీదకు వచ్చి చేరాడు. ఆ ముగ్గురిలో ఒక అమ్మాయి తనలో తాను గొణుక్కున్నట్లు అంది:

"ఇది తిమ్మసముద్రం రూటేనా?"

"ఏం మహాతల్లీ! ఇది హిందూమహాసముద్రం రూటనుకున్నావా? నీ కెప్పుడూ ఏదో ఒక అనుమానమే. ఒక్కపని చెయ్యలేవు, ఏ అనుమానం లేకుండా, ముందుగా నువ్వే లారీ ముందు కట్టిన బోర్డు చూశావు. మన పలావుల సారూ చెప్పాడు. తీరా అక్కడికి వెళ్ళి నాయుడుకంద్రిగ ఇదేనా అనేవు. టోపీ లాక్కుపోతారు. మనం రెగ్యులర్ పోలీసులం కూడా కాదు, నోరులేని జనం భయపడ్డానికి. చూడండి సార్!"

—తొందరపాటమ్మాయి నావైపు తిరిగి అడిగింది.

ఏం చెప్పేది? మా పిల్లల పిరికితనం నాకు అనుభవమే. 'అందరికీ నీ మాదిరి ధైర్యం ఉండాల గదా?' అని అందామనుకున్నాను. జవాబుగా నవ్వి ఊరుకున్నాను. ఆ అమ్మాయికూడా బదులు నవ్వేసింది. అటుతిరిగి తన స్నేహితురాళ్ళతో మాటల్లో పడిపోయింది. తొందరపాటమ్మాయి కలుపుగోలుతనం చూసి నాలో నేను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. ఈ అమ్మాయికి తొందరపాటెక్కువ అని పోలీసు కానిస్టేబుల్ అంటే అన్నాడు కానీ, నా కట్లా అనిపించ లేదు. మనస్తత్వంలో దృఢత్వమున్నట్లుంది.

మనిషి సన్నగా ఉంది. మధ్యరకం ఎత్తు పలచటి పొడుగాటి ముఖం. అతికినట్లు ముక్కు. గోధుమరంగు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించే అందం కాకపోవచ్చు. ముఖం తీరులో ఆకర్షణ ఉంది. కళ్ళలో తెలివి, చిలిపితనం, ధీమా, నిర్లక్ష్యం కనిపిస్తాయి. ఆషామాషీ మాట తీరులో కొంటెతనముంది; ఆకట్టుకునే లక్షణముంది. సందడి పిల్ల అనుకున్నాను.

లారీ టౌన్ దాటి తిమ్మసముద్రం దుమ్ముగొడ్డుమీద నెమ్మదిగా వెళ్తోంది. స్నేహితురాళ్ళతో మాట్లాడుతున్నదల్లా ఆగి ఆ సందడిపిల్ల నన్ను అడిగింది:

"మీ రే పోలింగ్ స్టేషన్ సార్?"

మా పి. ఓ. నాగేశ్వరరావు సమయం కోసమే కాచుకొని కూర్చున్నట్లు జోక్యం కలుగచేసుకున్నాడు:

"మా ఇద్దరిదీ ఏరువపాళెం. నేను ప్రిసైడింగ్ ఆఫీసర్ని, ఈయన ఎ.పి.ఓ."

నాగేశ్వరరావును ఆ అమ్మాయి ఎగాదిగా చూస్తూ అడిగింది:

"ఏరువపాళెం హరిజనవాడా సార్?"

"ఆఁ – అదే," అన్నాను నేను.

"నాకు డ్యూటీ వేసింది కూడా అక్కడే సార్," అంది ఆ అమ్మాయి.

"మీ...నీకా ?" నాగేశ్వరరావు ఆశ్చర్యపోయాడు.

"అవును సార్. నాకే. మీకేసినట్లే, వీళ్ళందరికీ వేసినట్లే," అందర్నీ చూపుతూ చెప్పింది.

"మా...మన పోలింగ్ స్టేషనుకు ఎంతమంది పోలీసు పెర్సనల్‌ను వేశారు?"

"ఏం సార్ ! ఏ పదిమందో లేకపోతే ఎలక్షన్ డ్యూటీ చేసేటట్లు లేరే ?"

ఆ మాట విన్న ఒక పి. ఓ. నవ్వుతూ అన్నాడు:

"ఈ రూట్‌లోని స్టేషన్లు సమస్యల్లేనివి లెండి."

గత ఎన్నికల్లో మా ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఉండిన ఆర్ట్స్ కాలేజీ లెక్చరర్, నాగేశ్వరరావు వైపు తిరిగి అన్నాడు: "మీకేం పరవాలేదు. మీ ఎ. పి. ఓ. గారే అన్నీ చేసుకుపోతారు. చూసుకుంటారు. పోయిన ఎలక్షన్లలో చూసినా కదా. కొంత సీరియస్ మనిషి. అయితేనేం, పనిలో అఖండుడు. బ్యాలట్ల మీద సంతకాలు పెడుతూ మీరు కూర్చుంటే చాలు."

"అలా కింది వాళ్ళకే పూర్తిగా బాధ్యత అప్పచెప్పడం నాకు సుతరామూ ఇష్టముండదండి. ఆఫీసరనే వాడు వెయ్యికళ్ళతో కనిపెట్టుకుంటూ పనిచేయించాలి ఎవరితోనైనా," మహిళా హోంగార్డులవైపు, ముఖ్యంగా సందడి అమ్మాయి వైపు చూస్తూ నాగేశ్వరరావు పి. ఓ. దర్పంతో అన్నాడు.

లెక్చరర్ నావైపు చూసి నవ్వి, పక్క మిత్రులతో మాటలు కలిపాడు. వాదం ముగిసింది.

తిమ్మసముద్రం రూటులో మలుపుదారిలోని మొదటి పోలింగ్ స్టేషన్ చేరడానికి గంట పైగా పట్టింది. అక్కడి పి. ఓ; ఎ. పి. ఓ. లతో సహా ఒక హోంగార్డు దిగింది.

లారీలోనుంచే మా సందడి హోంగార్డు రూటు ఆఫీసర్‌తో కేకవేసి చెప్పింది:

"సార్ ! రూట్ ఆఫీసర్‌గారూ ! అది నోయిలేంది. కొంచెం బాగా చూడమని అందరికీ చెప్పిరండి."

"అట్లనే, అట్లనే," రూట్ ఆఫీసర్ హామీ ఇచ్చాడు.

మా హోంగార్డు మిత్ర రక్షణ పద్ధతి చూసి, ఆడపిల్లలంటే ఇట్లా ఉండాలి అని అనుకున్నాను.

తిరిగి తిమ్మసముద్రం రూటు రోడ్డులో పడి, మరొక గంట ప్రయాణం చేసి రెండో పోలింగ్ అధికారులిద్దరూ, అనుమానాల హోంగార్డూ దిగాక, మా హోంగార్డు ప్రిసైడింగ్ ఆఫీసరైన లెక్చరర్‌తో అంది:

"సార్, సార్! అది అనుమానం పక్షి. మరేమి అనుకోకుండా మీలో ఒకరిగా చూసుకోండి"

"అట్లాగే లేమ్మా!" అన్నారాయన నవ్వుకుంటూ.

"అమ్మయ్య! వీళ్ళిద్దరికీ ఇక ఇబ్బంది లేదు. మనం మిగిలాం. ఇంకెంత దూరమో? చీకటి పడేటట్లుంది," తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు నావైపు చూస్తూ మా సందడి హోంగార్డు అంది.

దూరం తెలియదు. ఈ రూటులో మాది చివరి పోలింగ్ స్టేషన్. జవాబివ్వ లేదు.

ఈ లోపు నాగేశ్వరరావు ఆ అమ్మాయితో మెల్లిగా కబుర్లు ప్రారంభించాడు. ఇప్పుడు లారీ బాడీలో ముగ్గురమే ఉన్నాం. నాగేశ్వరరావు కబుర్లు విన కూడదనుకున్నా సారం చెవులబడింది. మొదట్లో ఒకటి రెండు పొడిమాటల్లో ఆ అమ్మాయి ఉద్యోగ కర్తవ్య దీక్షను పొగిడాడు ఆ తర్వాత వరుసగా తన చదువు, ఉద్యోగం, హోదా, అధికారులు, ఇష్టాల దండకం చదివాడు. తను కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో బి. ఇ. చదివాడట. కాలేజీ రోజుల్లో స్టూడెంట్ ఛైర్మన్ అట. తమది తాడేపల్లిగూడెం దగ్గరట. తమది మంచి ఆస్తీ పలుకుబడీ ఉన్న కుటుంబమట. రోడ్డు, భవనాల శాఖలో చేరి అయిదేళ్ళయిందట. తమవైపు జనం చాలా నాగరికంగా ఉంటారట. ఇంత మందిలో ఆ అమ్మాయిలోనే ఆ నాగరికత చూసి ఆశ్చర్యపోయాడట. ఏ కళనుందోగాని, సందడి హోంగార్డు చురకలేవీ వేయకుండా వింది. విందో లేదో?

మా పోలింగ్ స్టేషన్ ఏరువపాళెం హరిజనవాడకు చేరుకునేసరికి చీకట్లు ముసురుకొస్తున్నాయి.

మా పోలింగ్ బూత్ హరిజనవాడకు అర కిలోమీటరు దూరంలో ఉన్న స్కూలు బిల్డింగు. ఇళ్ళులేని ఏరువపాళెం దాటి, మాలవాడ దాటి, హరిజనవాడ మీదుగా వచ్చి చేరుకున్నాం. లారీ ఆగాక నాగేశ్వరరావు ముందు దిగాడు. తన బ్రీఫ్‌కేసు అందివ్వమని పురమాయించాడు. అందించాను. అందుకొని మాటా పలుకూ లేకుండా స్కూలు ఆవరణలో కొంత దూరంవెళ్ళి నిల్చొని ఒళ్ళు విరుచుకున్నాడు; సిగరెట్ ముట్టించుకున్నాడు. ఎన్నికల సామగ్రి ఉండే రెండు గోనెసంచుల్నీ, నా చిన్న సూట్‌కేసునూ, తన బ్యాగునూ దింపుకోవడంలో మా 'తొందరపాటమ్మాయే', 'సందడిపిల్లే', 'మహిళా హోంగార్డే' తోడ్పడింది. అప్పుడా అమ్మాయి పేరడిగాను, చనువు తీసుకొని. పంకజం అని చెప్పింది.

"ఈ స్కూలు టీచరుదానా ఇక్కడ ఒక పోలింగ్ ఆఫీసర్. మనం వచ్చేదాకా ఉండమంటినే ఉండి ఏర్పాట్లూ అవీ చూడమని నిన్న చెప్పి పూడి

స్లినే. మీరుండండి, నేనుదా పూడ్సి పంపుతాను. ఈ సర్పంచిదా వేలూరాస్పత్రిలో. పి.ఎం.లు, కె.ఎం లు గోవింద కొట్టిరి. మాకుదా సావు," రూట్ ఆఫీసర్ అస హనంగా లారీ ఎక్కి వెళ్ళబోతున్నాడు.

స్కూలు టీచరు ఇద్దరు పిల్లలతో వచ్చాడు. వాళ్ళ చేతుల్లో రెండు లాంత ర్లున్నాయి. స్కూలు టీచరుతో మాటాడి రూటాఫీసర్ వెళ్ళిపోయాడు.

పిల్లలు మా సామాగ్రిని స్కూలు గదిలోకి చేర్చారు. అది ఒకటే పొడవాటి గది. ఆ గదికి అటూఇటూ తలుపులైతే ఉన్నాయి. కిటికీల తలుపు లన్నీ దాదాపు విరిగిపోయి ఉన్నాయి. స్కూలు గదిలో రెండు టేబుళ్ళు, రెండు చేతులు విరిగిన కుర్చీలు, రెండు బెంచీలు ఉన్నాయి. ఒకమూల స్కూలు రికార్డు పెట్టె తాళం వేసి ఉంది. ఎడమవైపు ఒక మూల నాటిన రెండు కర్రల చుట్టూ, రెండు దుప్పట్లతో ఆ పాటికే 'బూత్' సిద్ధంగా ఉంది.

రెండు బెంచీలనూ నాగేశ్వరరావు ఎడమ గోడకు దగ్గరగా పిల్లలతో వేయించుకొని, రాత్రి పడక సిద్ధం చేసుకున్నాడు. కుర్చీలో కూర్చొని బ్రీఫ్‌కేసు చూసుకుంటున్నాడు. పంకజం కుడిగోడకు దగ్గరలో బ్యాగు ఉంచింది. నేను మధ్యలో నా చిన్న సూట్‌కేసు పెట్టాను.

గోడలకు దిగగొట్టిన మాసిపోయిన దేశనాయకుల ఫోటోలను చూస్తూ, అట్టలమీద రాసిన వాటిని నిశ్శబ్దంగా చదువుతూ గదిచుట్టూ తిరిగి ఒకచోట నిలిచి, పంకజం మాకు వినబడేటట్లు "స్త్రీలను గౌరవింపుము" అని బిగ్గరగా చదివింది. "మంచివి రాశారు పిల్లలకు" అని అక్కడే నిలబడి స్కూలు టీచ రును మెచ్చుకుంది.

"ఇక్కడ ఎలక్ట్రిసిటీ లేదా ?" అని టీచరును నాగేశ్వరరావు అడిగాడు.

"లైనులు మాత్రం ఒక అర కిలోమీటరు దూరంలో పోతున్నాయి సార్ ! మా రెండు వాడల్లో కిరసనాయిలు బుడ్డే లైట్లు" అని టీచరు నవ్వాడు.

"పెట్రొమాక్స్ లైటైనా దొరకదా ?"

"ప్రయత్నిస్తిని సార్. దొరకలేదు. ఈ రెండు లాంతర్లలో ఒకటి మా ఇంట్లోది. రెండోది హరిజనవాడలోని వయోజన విద్యాకేంద్రానిది. ఎలక్షన్లలో ఈ ఇబ్బందులు తప్పవు సార్...ముందు ముఖాలు కడుక్కోండి. అదో ఆ ఎదు రుగా బోరింగ్ ఉంది. బక్కెట్టూ, చెంబు పెట్టిస్తిని. భోజనాలు ఒక గంటకు రెడీ అవుతాయి. కోడి కూడా కోయిస్తి మీరు నాన్ వెజిటేరియన్ కదా ?"

"వెజిటేరియన్," అన్నాడు నాగేశ్వరరావు.

"అడిగానని ఏమీ అనుకోకండి. మీరు బ్రాహ్మలా సార్ ?" పంకజం నాగేశ్వర్రావును అడిగింది.

"కాదు, మా ఇంట్లో అందరం వెజిటేరియన్లమే. ఎగ్ కూడా తినం. మా బంధువుల్లో కూడా అందరూ అంతే. మీరు తింటే నాకు అభ్యంతరం లేదు."

తనకు పట్టింపులు లేవని పంకజం అంది.

"మా కలవాటే" అని నేనన్నాను.

స్కూలు టీచరు "సాంబారు కూడా చేయిస్తి సార్," అని పిల్లలను తీసుకొని వెళ్ళిపోయాడు.

పంకజం తన టోపీ తీసి పక్కన పెట్టింది. సబ్బు తీసుకొని, ముఖం కడుక్కొని వచ్చింది. నేనూ, నాగేశ్వరరావూ బోరింగ్ దగ్గరకు నడిచాం. మేము తిరిగి వచ్చేలోగా పంకజం చక్కగా చీరలోకి మారి ఉంది. జుట్టు దువ్వుకుంటూ ఉంది. పోనీటెయిల్ వేసుకుంది. పంకజం వలన నాగేశ్వరరావు కళ్ళార్పకుండా తమకంతో చూడడం గమనించాను.

భోజనాల సందర్భంలో పంకజం కోడిముక్క కొరుకుతూ నాగేశ్వరరావును కదిలించింది:

"కూటికి పనికిరాని బ్రాహ్మణ్యం వదిలించుకోవాలని మేం చూస్తాంటే, అందులోకి కమ్మ బ్రాహ్మలని, రెడ్డి బ్రాహ్మలని మీరు జొరబడితే ఎట్లాసార్ ?"

నాగేశ్వరరావు ఆశ్చర్యపోతూ అడిగాడు:

"నువ్వు బ్రాహ్మిన్వా...పంకజం ?"

"ఆ...శుభ్రంగా. అక్షరాలా వైఖానసులం. భారద్వాజస గోత్రం. ఇంటి పేరేమిటనుకున్నారు ? సేనాధిపత్యం ! ఇప్పుడిట్లా హోంగార్డుల సేనలో రోజుకు పదిహేను రూపాయల దినకూలీలో ఉన్నాననుకోండి. అది వేరే సంగతి."
–పంకజం పడిపడి నవ్వసాగింది.

మా ఇంట్లో ఏ రోజూ కూడా భోజనాల సమయంలో అంతటి సంతోష వాతావరణాన్ని నేను చూడలేదు. కడుపునిండా భోంచేశాను. అందరి భోజనాలయ్యాయి.

స్కూలు టీచరు పంకజాన్ని అడిగాడు:

"రాత్రి మా ఇంట్లో పడుకొని, ఉదయాన్నే రావచ్చు గద సిస్టర్ ?"

"నాకేం ఇబ్బంది లేదు సార్. ఇది అడవి కాదు. తోడు మన సార్లున్నారు," అంది పంకజం.

పంకజం ఆ విషయాన్ని అంత మామూలుగా తీసుకోవడం చూసి చకితుణ్ణయ్యాను. పంకజాన్ని నాగేశ్వరరావు మర్మంగా చూసినట్టు నా కనిపించింది. నాది అనుమానమే కావచ్చు. టీచరూ, టీచరుతో వచ్చిన మరో ఇద్దరు ఖాళీ గిన్నెలు తీసుకొని వెళ్ళి పోయారు. రెండు బెంచీలమీద నాగేశ్వరరావు పడు

కున్నాడు. రెండు నిమిషాలాగి "నాకు వెలుతురుంటే నిద్ర రాదండి" అన్నాడు, పైకేసి చూస్తూ.

ఆయన వైపున లాంతరు ఆర్పివేశాను. మరొక లాంతరును పంకజం వైపు ఒక మూల, వత్తి బాగా తగ్గించి పెట్టాను. గుడ్డి వెలుగులో నేను మధ్య పడుకున్నాను. పంకజం అటు చివర పడుకుంది.

నాకు ఒకంతట నిద్ర రాలేదు. కిటికీల్లోంచి బయట ఏమీ కనిపించడం లేదు. ఎక్కడో దూరం నుంచి ఏకతార మీద గొంతెత్తి పాడుతున్న ఒక తత్త్వం వినబడుతోంది:

'ఏమి తలచి నను మ్రోహిస్తివీ
దేహ మేలాటిదని ఆలోచిస్తివి
స్వామీ
మోహామె కాని సారమేమియు లేదు
మోము కన్నులలోన మధురాపు
మాంసములేగాని...'

అంటూ ఇలా... పాటగత్తె పల్లవిని సాగదీస్తూ మళ్ళీ మళ్ళీ పాడుతోంది. నా చిన్నతనంలో ఆ పాటను మా ఊళ్ళో సిద్ధమ్మ పాడుతూంటే చాలామార్లు విన్నాను. పాటగత్తె కొన్ని నిముషాలు ఆగింది.

["పుట్టి ఆ దారినే వస్తివీ మరలా
వచ్చి ఆ దారి కాశిస్తివీ"]
అనే చరణాలు ఎత్తుకుంది.

అది దేహం మీద ద్వేషమా? ఏ మోక్షం మీదో వ్యామోహమా? బతుకులోని బాధల్ని తట్టుకునే కవచమా? మనసు కకావికలమవుతోంది. ఈ పాట వింటుంటే నాగేశ్వరరావుకు ఏమనిపిస్తుందో? పంకజం నవ్వుకునే ఏ వ్యాఖ్య చేస్తుందో? మా అమ్మాయిలు వింటే ఏమంటారు? ఏమైనా జీవితాన్ని చూసే పద్ధతి ఇది కాదేమో! పాట ఆగింది. మధ్య మధ్య కీచురాళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి...

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. ఏదో అలికిడైంది. మెలకువ వచ్చింది. చీకటి, ఏమి కనిపించడం లేదు. మూలనున్న లాంతరు కూడా కునికి కునికి ఆరినట్లుంది.

ఆ చీకట్లో పంకజం గొంతు స్పష్టంగా వినిపించింది:

"ఏం పి.ఓ. సార్? నిద్ర రావడం లేదా? కొంపదీసి నన్ను మీ భార్యగా అనుకున్నారేమిటి?"

"ప్లీజ్! పంకజం! నెమ్మది..." నాగేశ్వరరావు కంగారు గొంతు, గుసుగుసలు వినిపించాయి.

నేను లేచి కూర్చొని తల దగ్గరే పెట్టుకున్న టార్చిలైటు వేశాను. పంకజం కాళ్ళ దగ్గరగా నాగేశ్వరరావు నిలబడి ఉన్నాడు.

"ఏం సార్, మీరు బయటకేమైనా పోవాలా?" అని అడిగాను:

"కొత్త చోటు - నిద్ర రావడం లేదు. బయటికి వెళ్ళి సిగరెట్ తాగి వద్దామనుకున్నా. చీకటి. తలుపు కనపడడం లేదు" నాగేశ్వరరావు అయోమయంగా జవాబిచ్చాడు.

అది అబద్ధమని తెలుస్తూనే ఉంది. ఆయన పడుకున్న వైపే ఒక తలుపు ఉంది. సిగరెట్లు అలవాటున్న మనిషికి అగ్గిపెట్టె దగ్గరుండకపోదు. పంకజంవైపు చూశాను. నిశ్చింతగా అటు తిరిగి పడుకుంది. టార్చిలైటు వెలుతుర్లో నాగేశ్వరరావు తడబడుతూ తన పడక దగ్గరకు చేరుకొని అక్కడున్న లాంతరు ముట్టించాడు. వత్తి పెద్దది చేసి, తలుపు తీసి బయటికి వెళ్ళి అయిదు నిమిషాలున్నాడు.

ఈలోపు "ఏమ్మా పంకజం" అని పిలిచాను. గాఢంగా నిద్రపోతూ ఉంది. నాగేశ్వరరావు లోనికి వచ్చాడు. లాంతరు వత్తి తగ్గించి పడుకున్నాడు. నేను నిశ్చింతగా నిద్రలోకి ఒరిగాను.

బోరింగ్ కొడుతున్న శబ్దం వినిపించింది. నిద్ర చెడింది. మండుతున్న కళ్ళు తెరిస్తే చుట్టూ ఏమీ కనిపించలేదు. లాంతరు ఆరిపోయిందనుకున్నాను. టార్చి వేసి టైము చూశాను. అయిదూ పది. తెల్లవారు ఝామన్నమాట. టార్చి వెలుతుర్లో చూస్తే బెంచీలమీద నాగేశ్వరరావు లేడు. నేలమీద పంకజం లేదు. అటూ ఇటూ తలుపులు రెండూ తెరచి ఉన్నాయి. తలుపు దగ్గరికి వచ్చాను.

పంకజం గొంతు వినిపించింది:

"సార్... పి.ఓ. సార్! ఇట్లా రావద్దు. స్నానం చేస్తున్నా. నా శీలమేమీ పోదనుకోండి... అయినా మర్యాద. అయిదు నిమిషా లాగండి. ఇట్లా రావద్దు. ఆ లాంతర్ని లోపల పెట్టండి."

నేను "సార్" అని నాగేశ్వరరావును పిలిచాను.

గబగబా లాంతరుతో తిరిగి వచ్చి, నాగేశ్వరరావు పదరుతూ సంజాయిషీ చెప్పాడు:

"మీరూ లేచారా? మంచిదైంది. కడుపులో బాగాలేదండి," అంటూ కడుపు చేత్తో పట్టుకున్నాడు.

"ఇటువైపు పోదాం పదండి. నేను తర్వాత బకెట్‌లో నీళ్ళు తెస్తాను" అన్నాను.

స్కూలు వెనుకవైపు మైదానంలోకి కొంతదూరం నాగేశ్వరరావును తీసుకువెళ్ళాను. లాంతరు ఒకచోట పెట్టి, నేను దూరంగా నిల్చున్నాను. పది పదిహేను నిమిషాలు అటూ ఇటూ తిరిగి నాగేశ్వరరావు వెనక్కు వచ్చాడు.

"ఇప్పుడు నెమ్మదించిందండీ," అన్నాడు నాగేశ్వరరావు, తన దొంగ బుద్ధిని కప్పిపుచ్చుకుంటూ.

"అయితే నెమ్మదిగా రెడీ అవుదాం" అన్నాను.

నాగేశ్వరరావు మౌనంగా నా వెంట నడిచాడు. మేము స్కూలు గదిలోకి వచ్చే వేళకు పంకజం హోంగార్డు యూనిఫాంలో ఉంది. బూట్ల లేసులు కట్టుకుంటోంది.

ఏమీ జరగనట్లే "తొందరగా మీరు తయారు కారా సార్?" అంది పంకజం.

ఎన్నికల తేదీనాటి మా దినచర్య మొదలైంది.

ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభించాం. స్కూలు టీచరు ఒక పోలింగ్ ఆఫీసర్. మరో పోలింగ్ ఆఫీసర్ ప్రక్క గ్రామంనుంచి వచ్చింది. ఇద్దరు ఏజెంట్లున్నారు. సమస్యలేవీ రాలేదు. వోటింగ్ మందకొడిగా సాగింది. వోటర్లను క్రమబద్ధంగా పంపడంలో పంకజం బాగా శ్రమపడింది. విసుగులేదు. చాకచక్యంతో నవ్వుతూ, నవ్విస్తూ పని చేసింది. నాగేశ్వరరావు మొదట్లో బెట్టు చేశాడు. దర్పం ప్రదర్శించాడు. వ్యవహారాలన్నీ నేనూ మిగతా ఇద్దరు పోలింగాఫీసర్లూ చూసుకున్నాం. సాయంకాలం నాలుగూ యాభై అయింది. డెబ్భైశాతం వోట్లు పోలయ్యాయి.

"ఇక కట్టేద్దాం. ఫారాలన్నీ పూర్తి చేసుకోవాలి. చాలా ప్రొసీజరుంది," అన్నాడు మా పి. ఓ. నాగేశ్వరరావు.

"ఈ పది నిమిషాలూ చూద్దాం సార్" అన్నాను.

"ఇంకెవరు వస్తారండీ చాదస్తంగాని," అని నాగేశ్వరరావు గొణిగాడు.

నాలుగైదు నిమిషాలుండనగా పంకజం లోనికి వచ్చి అంది:

"సార్, ముప్పయి మంది దాకా మిగిలినట్లుంది. పదిహేను మంది బయటున్నారు. మిగతా, వంద గజాల్లో దారిలో వస్తూ కనపడుతున్నారు."

"కుదురదు" అన్నాడు మా పి ఓ - ఏజెంట్లు అప్పటికే వెళ్ళిపోవడం గమనించి.

"ఇంకా మూడు నిమిషాలుంది కదా సార్? కూలికి వెళ్ళేవాళ్లు. మనలాగా తీరిక ఉండద్దూ. చీట్లిచ్చి, అయిదు దాటినా పోలింగ్ జరపండి సార్." అంది పంకజం.

"బూత్‌ను దృష్టిలో పెట్టుకుంటే, అట్లాగే చేయడం మంచిదనిపిస్తుంది సార్" అన్నాను. మా పోలింగ్ ఆఫీసర్లు నన్ను సమర్థించారు.

మా పి. ఓ. సణుగుతూ అంగీకరించాడు. రైతులుండే పోలింగ్ కేంద్ర మైతే ఆ సణుగుడు ఉండేది కాదనుకున్నాను. ఆరు గంటలకు పోలింగ్ పూర్తి అయింది. ఏడుకల్లా బ్యాలెట్ పెట్టెలకు సీలు వేయడం, మిగతా ఫారాలు పూర్తి చేయడం, కట్టడం వగైరాలు ముగిశాయి. స్కూలు టీచరు మాతోనే ఉన్నాడు. మహిళా పోలింగు ఆఫీసర్ వెళ్ళిపోయింది. ఆలస్యం కావచ్చునని స్కూలు టీచరు భోజనాలు ఏర్పాటు చేస్తానని వెళ్ళి అన్నం, చట్నీ, మజ్జిగ తెప్పించాడు.

తనకు భోజనం అక్కరలేదని నాగేశ్వరరావు అన్నాడు. మేం భోజనం ముందు కూర్చున్నాం.

నాగేశ్వరరావు మెరుపు దాడి చేశాడు:

పోలీస్‌స్టేషన్‌లో మానభంగాలుంటాయని రాస్తుంటారు కదా? ఆడ పోలీసులు చాలకా?"

ఆ ప్రశ్నకు నేను దిగ్భ్రాంతుణ్ణయ్యాను.

పంకజం భోజనం మధ్యలో లేస్తూ గంభీరంగా అడిగింది:

"తెలుగు సినిమాల్లో అయితే మీ డైలాగు బాగుండేమో సార్. నాకు అన్నం సహించలేదు. ఆ మాట అనే నోటితో మీరెట్లా తిన గలుగుతారో రోజూ?"

చావుదెబ్బ తినికూడా నాగేశ్వరరావు రెచ్చిపోలేదు. దానికి సంతోషం! ఒక మహిళా హోంగార్డు ముందు ఆ మాట అనగలిగాడు కానీ, ఏ మగపోలీసు ముందో ఈ పెద్ద మనిషి, ఈ అధికారి ఒక్కమాట అనగలడా అనుకున్నాను.

లారీ వచ్చింది, రాత్రి పదకొండు గంటల ప్రాంతాల్లో. అపరాత్రికి నియోజకవర్గ కేంద్రం చేరుకొన్నాం. పని పూర్తి అయ్యాక మా పి. ఓ. వెళ్లొస్తానని కూడా చెప్పకుండా మాయమయ్యాడు.

పంకజం వీడ్కోలు చెప్పడానికి నా దగ్గరకు వచ్చింది. నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నేను కదిలిపోయాను.

"ఈ ఉద్యోగం ఎందుకు చేస్తున్నావమ్మా?" అన్నాను.

"పదో క్లాసు తప్పినదానికి వేరేం ఉద్యోగం దొరుకుతుంది సార్? నామీద ఆధారపడుతున్నవాళ్ళు నలుగురున్నారు. నాన్నలేడు. ఎక్కడైనా ఏదో ఒకటి ఉంటుంది కద సార్ - అందులోనూ అందరికీ అలుసుగా కనిపించే మా ఆడ వాళ్ళకు?" అంది పంకజం.

"ఆ పి. ఓ. వెధవ..." పూర్తి చేయలేకపోయాను.

"అదొక రకం ఊరకుక్క సార్. అదిలిస్తే పారిపోయే రకం," పంకజం పగలబడి నవ్వింది...

"పిచ్చి కుక్కలు వెంటబడితే ఏం చేస్తావని ఆలోచిస్తున్నారు కద సార్?"

ఎబ్బెట్టుగా నవ్వాను.

"శరీరం ఒంపు సొంపులు తప్ప ఏదీ కనిపించని సంస్కారం మగ వాళ్ళలో ఉన్నంతకాలం నా బాధలైనా, మీ బిడ్డల బాధలైనా, మరొకరివైనా ఇంతేనో, ఇంతకన్నా ఘోరమో కదసార్ ? మీరైతే ఏం చేస్తారో చెప్పండి ?"

వణికిపోయాను.

పంకజం నవ్వుతూ సెలవు తీసుకుంది. రామబాణం చెట్లు రాల్చిన పూల మధ్య చీకటిని చీల్చలేని కాంతిరేఖల మధ్య పంకజం టకటకా సాగిపోతోంది.

మా అమ్మాయిలను ఇన్నాళ్ళూ కాపాడుతున్న వనుకుంటున్న మా రెక్కలు ఎంత బలహీనమైనవో ఆ క్షణంలో నాకు తెలిసివచ్చింది. ●

○ జనవరి 6-20, 1991, ఇండియా టుడే.